క్లుప్తంగా

కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



ప్రతిష్ఠా మహోత్సవంలో పూజలు చేస్తున్న దంపతులు

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో సుమారు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఆలయ, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరగనుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ముమ్మిడివరం: ఏపీ బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత వారికి కుట్టుమిషన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల మహిళలు సమీపంలోని సచివాలయంలో నేటి నుంచి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి ఆ తర్వాత కుట్టు మెషీన్ల మంజూరు నిమిత్తం మున్సిపాలిటీలోని 30 వార్డుల నుంచి మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉపాధిలో భాగంగా టైలరింగ్‌లో నిష్ణాతులైన వారితో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 45 రోజులు లేదా 60 లేదా 90 రోజుల పాటు బీసీ కార్పొరేషన్ శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ పొందగోరే మహిళలు 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు.

నిందితులకు కఠిన శిక్షలు విధించడం హర్షణీయం

అమలాపురం టౌన్: ప్రణయ్ హత్య కేసుకు సంబంధించి నల్గొండ కోర్టు నిందితులకు కఠిన శిక్షలు అమలు చేస్తూ సంచలన తీర్పు ఇవ్వడం హర్షణీయమని అమలాపురానికి చెందిన రాష్ట్ర పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దళిత యువకుడు ప్రణయ్ హత్య కేసులో ఏ2 నిందితుడు సుభాష్ శర్మకు ఉరి శిక్ష, మిగిలిన నిందితులకు జీవిత ఖైదు విధించడంతో వారు చేసిన తీవ్ర నేరాలకు కోర్టు సరైన శిక్ష విధించినట్లయిందని పేర్కొన్నారు. 2018 సెప్టెంబర్ 18న మిర్యాలగూడలో ఈ హత్య జరిగినప్పుడు పీడీఎస్‌యూ, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ఓ రోజు బంద్ నిర్వహించడాన్ని తిరుపతిరావు గుర్తు చేశారు.


కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఐ.పోలవరం: సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు భైరవపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్టు హెచ్ఎం మూర్తి సోమవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సామర్లకోట మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించిన సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలు, ఎంపికల్లో పాఠశాలకు చెందిన పెసంగి దివ్యశ్రీ ఎంపికై నట్లు చెప్పారు. ఈ నెల 14,15,16వ తేదీలలో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

నిత్య కల్యాణాల కోటా విడుదల

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్, మే నెలలకు సంబంధించి నిత్య కల్యాణాల కోటాను సోమవారం విడుదల చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. మొత్తం రెండు నెలలకు సంబంధించి 7,076 కల్యాణాలకు కోటా విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్‌లో 4,148, కార్యాలయంలో 2,928 అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, కార్యాలయంలో గానీ నేరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మాస పూజలు, రుద్ర హోమం, చండీ హోమం, లక్ష పత్రి పూజల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

న్యాయవాది ఈశ్వరరావు మృతి




గుత్తాల ఈశ్వరరావు (ఫైల్)

ముమ్మిడివరం: ముమ్మిడివరానికి చెందిన న్యాయవాది గుత్తాల ఈశ్వరరావు(62) అనారోగ్యంతో చికిత్స పొందుతూ విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల న్యాయవాదుల సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

వైద్యో నారాయణో ఏరీ..!

- గ్రామీణ ప్రాంతాల్లో అందని ద్రాక్షగా అత్యవసర వైద్యం
- ఆపద సమయంలో దూర ప్రాంతాలకు పరుగులు తీస్తున్న జనం
- వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక రోగుల అవస్థలు
- ఆస్పత్రులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవు



భీమనపల్లిలో తాళం వేసి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



గోడిలంక పీహెచ్‌సీలో వాచ్‌మన్ లేక ధ్వంసమైన కిటికీ, ఫర్నిచర్(ఫైల్)

ఉప్పలగుప్తం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగుల కనీస అవసరాలను తీర్చలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆపదొస్తే వారు ఎటు వెళ్లాలో తెలియని అయోమయ స్థితిలో బతుకులు వెళ్లదీస్తున్నారు. అకస్మాత్తుగా ఆపదొస్తే స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలను ఆశ్రయిస్తున్న పేదలకు కనీస వైద్యం అందని ద్రాక్షగా మారింది. కొన్ని చోట్ల రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేక అత్యవసర వైద్యం నిమిత్తం అటు అమలాపురం, ఇటు ముమ్మిడివరం ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి గ్రామాల్లో దాపురించింది. సకాలంలో వైద్యసేవలు అందక నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న సంఘటనలు కోకొల్లలు. కొన్ని చోట్ల వాచ్‌మెన్‌లు, పారిశుధ్య కార్మికులతో వైద్యం చేయిస్తూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఎల్లప్పుడూ ఆసుపత్రిలో వైద్య సేవలను అందించాల్సి ఉంది. ఒకరు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మరొకరు రెండు నుంచి రాత్రి పది గంటల వరకు, మూడో వ్యక్తి రాత్రి పది నుంచి మరునాడు ఉదయం ఆరు గంటల వరకు మూడు షిఫ్టులుగా విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు సెలవు తీసుకున్నా ఆ స్థానంలో మరో స్టాఫ్‌నర్సు గానీ, ఎఫ్ఎన్ఓ లేదా వైద్యాధికారి అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. పీహెచ్‌సీ పరిధిలో ఎవరికైనా ఆపద వస్తే వైద్యాధికారి వెంటనే వచ్చి వైద్యం అందించే విధంగా అందుబాటులో ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ తరహా సేవలందక ఏదైనా ఆపద వస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని పీహెచ్‌సీలలో స్టాఫ్ నర్సులు అందుబాటులో లేకపోవడం, మరికొన్ని పీహెచ్‌సీలలో నైట్ వాచ్‌మెన్‌లు లేక స్టాఫ్ నర్సులు విధులకు రావడానికి ఆసక్తి చూపించడం లేదు. కొన్ని పీహెచ్‌సీల్లో అయితే సాయంత్రం అయ్యేసరికి సమయం ఆసన్నమైనట్లు భావిస్తూ సిబ్బంది ఇంటి బాట పడుతున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు సైతం స్థానికంగా ఉండకుండా పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో సకాలంలో వైద్యం అందక పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమలాపురం నియోజకవర్గంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఒక ఏరియా ఆసుపత్రి, ఒక సీహెచ్‌సీ, 7 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా కేవలం ఒకే ఒక్క స్టాఫ్‌నర్సు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం అయితే ఆసుపత్రిలో వాచ్‌మెన్ తప్పా మరెవ్వరూ కనిపించని దయనీయ స్థితి నెలకొంది. ఇటీవల వానపల్లిపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు ఫిబ్రవరి 1న పాముకాటుకు గురయ్యాడు. అతడిని స్థానిక ఆసుపత్రికి తీసుకువెళితే అక్కడ సిబ్బంది లేక అమలాపురం ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకొని ప్రాణాపాయం నుండి గట్టెక్కాడు. అల్లవరం మండలం గోడిలంక పీహెచ్‌సీలో వాచ్‌మెన్ లేకపోవడంతో గతంలో ఓ దుండగుడు ఆసుపత్రి అద్దాలను ధ్వంసం చేసి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశాడు. భీమనపల్లి, గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీలలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నా నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో వారికి రక్షణ లేక మహిళా ఉద్యోగులు రాత్రి వేళల్లో విధులకు రావడానికి ఆశక్తి చూపించడం లేదు. బెండమూర్లంకలో ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓ సహాయంతో స్టాఫ్ నర్సులు రాత్రి వేళల్లో విధులు నిర్వర్తిస్తున్నా మిగతా చోట్ల ఆ పరిస్థితి కనిపించడం లేదు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 11 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు ఉన్నాయి. కమిని పీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాట్రేనికోన పీహెచ్‌సీలో స్వీపర్‌తో వైద్యం చేయించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేశాయి. ఐ.పోలవరం మండలం కేశనపల్లి, జి.వేమవరం పీహెచ్‌సీలలో నైట్ వాచ్‌మన్‌లు, పారిశుధ్య కార్మికుల పోస్టులు ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో స్టాఫ్‌నర్సులు అందుబాటులో ఉండటంలేదు. తాళ్లరేవు సీహెచ్‌సీలో కలెక్టర్ పర్యటన తర్వాత సిబ్బంది అందుబాటులోకి వచ్చారు.

ప్రాణాపాయం నుంచి బయటపడ్డాం



ఈ నెల ఒకటో తారీఖున మానాన్న గారిని తాచుపాము కాటు వేసింది. స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తీసుకువెళ్లాం. అక్కడ చికిత్స అందించేందుకు గానీ, యాంటీ వీనమ్ ఇంజక్షన్ ఇచ్చేందుకు గానీ వైద్య సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. వాచ్‌మెన్ మాత్రమే ఉన్నాడు. గత్యంతరం లేక 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురానికి వెళ్లి వైద్యం చేయించుకున్నాం. తృటిలో ప్రమాదం తప్పింది.

నల్లా రమేష్, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

చిన్నపాటి వైద్యసేవలు అందిస్తాను



ఆసుపత్రిలో నైట్ డ్యూటీలో ఎవరున్నా ఎవరైనా గాయాలతో వస్తే వైద్యం నేనే చేస్తాను. కాన్పులు సైతం చేయగలను. గాయాలకు ప్రథమ చికిత్స చేసి కట్టుకడతాను. ఇలా ఎన్నో ఏళ్ల నుంచి సేవలు అందిస్తున్నాను.

నాగమ్మ, ఆసుపత్రి స్వీపర్, కాట్రేనికోన పీహెచ్‌సీ.

గ్రామీణ పాఠశాలల విలీనం తగదు

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీజీ లోక్



సమావేశంలో మాట్లాడుతున్న లోక్

అమలాపురం టౌన్: గ్రామీణ పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ యోచన దుర్మార్గ పూరితమైన ఆలోచనని ఇది మూమ్మాటికీ అభివృద్ధి నిరోధక కుట్రేనని భారత రిపబ్లికన్ పార్టీ (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీజీ లోక్ ఆరోపించారు. స్థానిక అరిగెల పాలెంలో సోమవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో లోక్ మాట్లాడారు. ఏదైనా ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలోని విద్యా ప్రమాణాల వృద్ధే ముఖ్యమని గుర్తు చేశారు. గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో ఆయా పాఠశాలలను మూసివేసి వాటిని ఎక్కువ సంఖ్యతో ఉన్న పాఠశాలల్లో విలీనం చేయాలనుకోవడం గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తెరచాటు ప్రభుత్వ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే రోజులు దగ్గర పడుతున్నాయని లోక్ హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు పెయ్యల శ్రీనివాస్, దోనిపాటి ఆంజనేయులు, పండు రాజేష్, డి.రాంజీ, ఉంద్రు శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫూలే సేవలు చిరస్మరణీయం



సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: నగర పంచాయతీలోని పోలమ్మ చెరువుగట్టు వద్ద గల బుద్ధపార్కులో డా.బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సంఘ సంస్కర్త సావిత్రీబాయి ఫూలే వర్ధంతిని నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగుల విద్యాభివృద్ధికి ఎనలేని సేవలందించిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీ బాయి ఫూలే అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి ఫూలే వర్ధంతిని ఐ.పోలవరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు డా.పుల్లెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు వ్యక్తలు మాట్లాడుతూ సావిత్రీబాయి జీవితంలో ఎదురైన సమస్యలను, ఎదుర్కొన్న తీరును వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మి, ఎం.మూర్తి, సత్యామణి, లోవరాజు, గంగాభవానిలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో చోరీ



ఆలయం బయట దొంగలు పగలగొట్టిన హుండీ

అమలాపురం టౌన్: స్థానిక మహిపాల వీధిలో వేంచేసి యున్న లక్ష్మీ గణపతి స్వామి ఆలయం వద్ద గల హుండీని దొంగలు పగలగొట్టి అందులోని నగదును తస్కరించారు. ఆదివారం సాయంత్రం ఆలయ పూజారి సాయికృష్ణ పూజలు చేసి ఆలయం తలుపులకు తాళం వేసి వెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారు జామున వచ్చి చూసేసరికి ఆలయం బయట ఉన్న హుండీ పగలగొట్టి ఉంది. క్లూస్ టీమ్ వచ్చి చోరీ ఆధారాలను సేకరించింది. పట్టణ ఎస్సై కిషోర్ బాబు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. హుండీల్లో రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ చిల్లర, నోట్లు ఉండవచ్చని ఆలయ కమిటీ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. ఆలయ కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

యువతకు ఉద్యోగాలు కల్పించాలంటూ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఓడలరేవు గ్రామస్తులు

అమలాపురం రూరల్: ఓఎన్జీసీ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అల్లవరం మండలం ఓడలరేవు గ్రామస్తులు అమలాపురం కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు పట్టుకుని సోమవారం ఆందోళన చేపట్టారు. ఓఎన్జీసీ టెర్మినల్‌లో గ్రామ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని, సముద్రపు కోత నివారణకు చర్యలు చేపట్టాలని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఎనిమిది రోజులుగా గ్రామస్తులు టెర్మినల్ వద్ద ఆందోళన చేపట్టగా ఓఎన్జీసీ పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఓఎన్జీసీ టెర్మినల్ నిర్మాణానికి గ్రామానికి చెందిన రైతుల వద్ద నుంచి సుమారు 500 ఎకరాల భూమిని సేకరించిందని అయితే గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మాత్రం కల్పించడం లేదని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

సామాజిక, ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

అసెంబ్లీ సమావేశంలో ఎల్జీ కైలాష్‌నాథన్



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎల్జీ కైలాష్‌నాథన్

యానాం: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో భాగమై భౌగోళికంగా దూరంగా ఉన్న యానాం, మాహే, కారైకల్ వంటి రీజియన్‌లలో సామాజిక, ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని అక్కడ వివిధ పథకాల అమలు తీరును ఇటీవల పర్యటనలో తాను పరిశీలించినట్లు ఎల్జీ కైలాష్‌నాథన్ పేర్కొన్నారు. సోమవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యార్థులు, వృద్ధులు, వితంతువులు, వెనుకబడిన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

యానాం: పట్టణ పరిధిలోని కురసాంపేట గ్రామంలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 రోజుల నుంచి తాగునీటి సమస్యపై సంబంధిత పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కోర్సులకు ఆహ్వానం

యానాం: నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం పుదుచ్చేరి యూనివర్సిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పి.గన్నవరం: స్థానిక కెనాల్ రోడ్డులో సోమవారం ఉదయం ఒక కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్తంభాన్ని ఢీకొట్టిన అనంతరం కారు కాలువలో పడకుండా ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు నుంచి నిడదవోలు వెళుతున్న కారుకు తాటికాయలవారిపాలెంలోని ధనవర్ష ఫంక్షన్ హాలు సమీపాన సైక్లిస్టు అడ్డువచ్చాడు. అతడిని తప్పించే క్రమంలో డ్రైవర్ కాలువ పైపున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. కారు కాలువలో పడకుండా విద్యుత్ స్తంభం ఆపింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ ప్రాంతంలో కాలువ లోతు ఎక్కువగా ఉంది. విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. కారులో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు.

ముస్లింల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే అశోక్



ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ముస్లిం కుటుంబాల సమగ్రాభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జామియా మసీదు, మసీదా కూబాల్లో ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ముస్లింల కోరిక మేరకు జామియా మసీదు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించుట, ముస్లిం బరేల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు చేశామని కొత్తగా ఘుసూల్ ఖానాకు అదనంగా మరో రూ.16లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ముస్లిం షాదీఖానాకు రూ.40 లక్షలు త్వరలోనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇమామ్‌లు మహ్మద్‌రఫీ, మహ్మద్ ఎజ్డానీ, మసీదుల అధ్యక్షులు ఎస్‌కెఎమ్ జిలానీ, కాలేషా, ముస్లిం పెద్దలు తాజుద్దీన్, ఫిరోజ్, సయ్యద్ రిజ్వాన్, జిలానీ, కరీమ్, గౌస్‌ముహుద్దీన్, అన్సారీ, ఫిరోజ్ మహ్మద్, బిస్మిల్లా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంగరలో వైభవంగా రథోత్సవం



అంగరలో వేణుగోపాలస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వీధుల మీదుగా రథంలో దేవతామూర్తులను ఊరేగించారు. ఇరు గ్రామాల భక్తులు రథాన్ని భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ స్వామిని కీర్తిస్తూ నినదించారు. అంగరలోని పోలేరమ్మ ఆలయం వరకూ రథయాత్ర సాగింది. అక్కడ నిర్వహించిన తీర్థ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిత్య హోమం, నీరాజన మంత్రపుష్పం పూజలు చేశారు. మంగళవారం విశేషార్చన, 12న సదస్యం, పండితాశీర్వచనం పూజలు చేయనున్నట్టు ఆలయ ఈఓ ఎం.రాంబాబురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, సామాజిక, రాజకీయ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగ వర్గీయులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి



మాదిగలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నిరసన తెలుపుతున్న మాదిగ నాయకులు

అమలాపురం రూరల్: సీఎం చంద్రబాబు మాదిగలకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కోనసీమ జిల్లా టీడీపీ, జనసేన, బీజేపీ మాదిగ దండోరా నాయకులు నిరసన తెలిపారు. మండలంలోని నడిపూడిలో జగ్జీవన్‌రామ్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి ఆశీర్వాదం అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. కోనసీమ జిల్లాలో మూడు ఎమ్మెల్సీలు, ఒక ఎంపీ పదవిని 75 ఏళ్లుగా ఎస్సీ కులంలోని మాల సామాజికవర్గం వారు అనుభవిస్తున్నారని అన్నారు. మాదిగలకు ఎమ్మెల్సీ ఇచ్చి న్యాయం చేయాలని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

వైభవంగా గరుడ వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చింతా వెంకట సుబ్బారావు ఉత్సవదారులుగా గరుడ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారిని గరుడవాహనంపై అధిరోహింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షికోత్సవం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో వేంచేసి యున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న ససమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిత్రలేఖన ఉపాధ్యాయుడికి సత్కారం

అమలాపురం రూరల్: కాట్రేనికోనలోని క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, చిత్రకారుడు ఆకొండి అంజి నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీలో అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్ర కుమార్ తన చిత్రాన్ని ప్రదర్శనలో ఉంచారు. ఈ చిత్రాన్ని పలువురు అభినందించారు. బహుమతి ప్రదానోత్సవలో ఆకొండి అంజి, మార్లపూడి ఉదయ్ కుమార్, ఎల్లపు కళాసాగర్‌ల చేతుల మీదుగా చంద్రకుమార్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

పీఎంశ్రీకి దేవగుప్తం హైస్కూల్ ఎంపిక

అల్లవరం: దేవగుప్తం ఉన్నత పాఠశాల పీఎం స్కూల్‌గా ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ సోమవారం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా ఆదేశాల మేరకు పీఎం శ్రీ పథకంలో భాగంగా స్కౌట్ అండ్ గైడ్ యూనిట్‌ను పాఠశాలలో సోమవారం ప్రారంభించినట్లు చెప్పారు. 6 నుంచి 9వ తరగతి వరకు 32 మంది బాలురు, 32 మంది బాలికలను ఎంపిక చేసి పీఈటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు మోసం

ఉప్పలగుప్తం: నిరుద్యోగులను అన్నింటా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే రమణారావు అన్నారు. కూటమి ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 12న చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు ప్రతినెల రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ఫ్యాక్టరీలో కాలిపోతున్న పీచు

అమలాపురం రూరల్: రూరల్ మండలంలోని పేరూరు గ్రామ పరిధిలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పీచు కాలిపోవడంతో రూ.మూడు లక్షల నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి మురళి కొండబాబు తెలిపారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామ పరిధిలోని రంగాపురం బాబు నగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ సాయం అందించింది. బాధిత కుటుంబాలకు వంట సామాగ్రి, ఇతర వస్తువులను అందజేశారు. సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత కుంచే స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.